# పెళ్ళి

పట్టుచీర కుచ్చెళ్ళను మరోసారి సవరించుకుని అద్దంలో తన భారీశరీరం అందాన్ని చూసుకుని తృప్తిగా నిట్టూర్చింది రాఘవమ్మ

రాఘవమ్మకు నలభై సంవత్సరాలుంటాయి. యిరవై రెండవయేట రాఘవమ్మకు లక్ష్మీపతితో వివాహం జరిగింది లక్ష్మీపతికి యిది రెండవ పెళ్ళి మొదటి భార్య చనిపోవడంతో రాఘవమ్మను చేసుకొన్నాడు.

లక్ష్మీపతి వ్యాపారంలో లక్షలు సంపాదించి తన పేరు సార్థకం చేసుకున్నాడు. ఎప్పుడూ వ్యాపారం గొడవల్లో మునిగి తేలుతూ యింటి సంగతి, యిల్లాలు సంగతి పట్టించుకోని లక్ష్మీపతి అంటే రాఘవమ్మకు చిరాకు. అయితే, ఆ చిరాకును మాత్రం బైటికి ప్రదర్శించేది కాదు

లక్ష్మీపతి వైఖరి రాఘవమ్మకు జీవితం మీద నిస్పృహ కలిగించింది. కొన్నాళ్ళు, భర్త వైఖరిని మార్చాలని రాఘవమ్మ ప్రయత్నించకపోలేదు కాని, లాభం లేకపోయింది. దాంతో, తన జీవితాన్ని పూజగదికి, స్వాములవార్లకు, బాబాలకు అర్పించింది. వారి సేవలో ముక్తికి మార్గం ఏర్పరచుకోవాలని రాఘవమ్మ అభిప్రాయం.

మరోసారి అద్దంలో చూసుకుని, గుండెలమీదుగా పైటను సవరించుకుంది రాఘవమ్మ. పోర్టికోలోకి వచ్చింది. డ్రయివర్ మస్తాన్ కారుతో సిద్ధంగా వున్నాడు రాఘవమ్మను చూడగానే కారు తలుపు తెరిచి వినయంగా పట్టుకున్నాడు.

నౌఖరు పూలసజ్జను పట్టుకువచ్చి కారులో వుంచాడు. దాన్నిండా కొబ్బరి కాయలు, అరటిపళ్ళు, పూలు వున్నాయి. పూలసజ్జను దగ్గరకు లాక్కొని, డ్రయివర్ని చూసి "పోనివ్వరా" అంది

కారు స్టార్టు చేశాడు మస్తాను. పది నిముషాల్లో కారు వూరి వెలుపలనున్న వెంకటేశ్వరుడి గుడిని చేరుకొంది. ఆరోజు ఏకాదశి, శనివారం కావడంవలన గుడి దగ్గర జనం ఎక్కువగా వున్నారు. అడుక్కునేవాళ్ళు భక్తుల కాళ్ళకు అడ్డంపడి, వేడుకుంటూ విసుగు తెప్పిస్తూ అడుక్కుంటున్నారు

రోడ్డుకు ఒక ప్రక్కగా కారును ఆపి, తలుపు తెరిచాడు మస్తాను రాఘవమ్మ మెల్లగా కారులోనుండి పూల సజ్జతో దిగింది.

ఆరోజు రాఘవమ్మ పుట్టినరోజు

అందువలన, గుడికెళ్ళి పూజ చేయించాలని రాఘవమ్మ ఉద్దేశం.

—"కారును జాగ్రత్తగా చూస్తుండు. పూజచేయించుకుని వస్తాను" అని చెప్పి బయలుదేరింది.

ప్రభాకరదేవ్

కొంతదూరం నడిచిందో, లేదో పదేళ్ళ కుర్రవాడు "ధర్మం తల్లీ!" అంటూ రాఘవమ్మ కాళ్ళకు అడ్డం పడ్డాడు. తైల సంస్కారంలేని జుత్తుతో, మాసిపోయి, చిరిగిన బట్టలతో అసహ్యంగా వున్నాడు- కుర్రవాడు.

"పోరా. పో." కసిరింది. లెక్క చెయ్యలేదు కుర్రవాడు.

"ధర్మం తల్లీ! పదిపైసలు పడెయ్యండి మీ కాళ్ళు మొక్కుతా ..." జారిపోతున్న లాగును పైకిలాక్కుంటూ, వొంగుని రాఘవమ్మ పాదాలను ముట్టుకొన్నాడు.

పాము తన పాదాలను ముట్టుకున్నట్టుగా వులిక్కిపడింది రాఘవమ్మ

"ఛ ఛ దొంగవెధవ ముష్టి వెధవ! ఎంతపని చేశాడు? వుదయంనుండి వుపవాసంచేసి, మడితో కోవెలకు వస్తే, వీడు తనను ముట్టుకున్నాడు. పడిన శ్రమంతా వృధా అయిపోయింది. మడి మంటగల్సి పోయింది గుంటవెధవ తనను ముట్టుకుని మైలపరిచాడు ఇక, గుడిలోకివెళ్ళి పూజ ఎలా జరిపించగలదు? అందులోను సహస్ర నామార్చన."

కోపంగా కుర్రవాడ్నిచూసి, గిర్రున వెనక్కి తిరిగింది. అయినా, కుర్రవాడు రాఘవమ్మను విడిచిపెట్టలేదు "ధర్మం తల్లీ!" అంటూ కాళ్ళకు అడ్డం పడుతున్నాడు. చేసేది లేక, పదిపైసలు తీసి వాడి ముఖాన కొట్టింది.

పూలసజ్జతో తిరిగి వస్తున్న రాఘవమ్మను చూసి ఆశ్చర్యపోయాడు డ్రయివరు మస్తాన్. సజ్జలోని పూజ సామానులు చెక్కు చెదరకుండా వున్నాయి.

"గుడికి వెళ్ళలేదా అమ్మగారూ?" వినయంగా ప్రశ్నించాడు మస్తాన్. కారు తలుపు తెరిచాడు

"లేదురా. అడుక్కునే వెధవ కాళ్ళకు అడ్డం పడ్డాడు వాడు నన్ను ముట్టుకొన్న తరువాత, ఆ మైలతో ఎలాగ పూజ జరిపించేది?" బాధగా, కోపంగా అంది. డ్రయివరు మాట్లాడలేదు. రాఘవమ్మ కారులో కూర్చున్న తరువాత, కారును స్టార్టుచేసి యింటివైపు పోనిచ్చాడు

* * *

అసుర సంధ్యాసమయం!

రాఘవమ్మ వొంటరిగా సోఫాలో కూర్చుంది. ఆమె మనసు చికాగ్గా వుంది. అందుకు రెండు కారణాలున్నాయి గుడివరకూ వెళ్ళి, పూజచెయ్యకుండా వచ్చేయడం. రెండు, పుట్టిన రోజునాడుకూడా భర్త వ్యాపారం గొడవల్లోపడి యింటికి యింకా రాకపోవడం.

ఉదయం మరీ మరీ చెప్పింది. "ఈ రోజు నా పుట్టినరోజండి, మధ్యాహ్నం కల్లా యింటికి వచ్చేయాలి." ఎన్నిచెప్పినా ఏం లాభం? వ్యాపారం గొడవల్లో పడ్డారంటే సర్వం మరచిపోతారు.

విసుగ్గా, సోఫా పక్కనవున్న టెలిఫోన్ రిసీవర్ని అందుకుంది రాఘవమ్మ. నెంబరు రింగ్ చేసింది

"హల్లో! నేనండీ రాఘవమ్మను."

"ఏమిటి విశేషాలు?" అవతలనుండి లక్ష్మీపతి గొంతు

"మధ్యాహ్నం యింటికివస్తానన్నారు. రాలేదు. ఈ దినం నా పుట్టినరోజని చెప్పాను. మరచిపోయారా?" నిష్ఠూరంగా అడిగింది. అలా అడుగుతున్నప్పుడు

రాఘవమ్మ గొంతు జీరబోయింది.

"సారీ డియర్! మరచిపోయాను."

"మరచిపోవడం మీ కలవాటేగా. పోనీ, యిప్పుడైనా వెంటనే వచ్చేయండి భోజనంచేసి, సెకండ్‌షోకి వెళ్దాం" అంది

"అలాగే డియర్! గంటలో వచ్చేస్తాను" రిసీవర్ని క్రెడిల్ చేసిన శబ్దం వినిపించింది.

నిట్టూర్చింది రాఘవమ్మ.

సోఫాలోనుండి లేచి బాత్‌రూంలోకి నడిచింది స్నానంచేసి, పట్టుచీర కట్టుకుంది.


"ఆయనతో పిక్చర్‌కెళ్ళి సంవత్సరం దాటింది." మనసులోనే అనుకుంది రాఘవమ్మ.

నౌఖరును పిలిచి, మల్లెపూలు తెప్పించుకొని, మాలకట్టుకొని, జడలో పెట్టుకుంది

గోడగడియారం "రంగ్



రంగ్." మంటూ తొమ్మిది గంటలు కొట్టింది.




"తొమ్మిదయింది. గంటలో వస్తా నన్నారు. ఇంకా రాలేదేమిటి చెప్మా!" ఆలోచిస్తూ, ఫోన్ దగ్గరకువెళ్ళి లక్ష్మీ పతికి రింగ్ చేసింది రాఘవమ్మ

"సారి డియర్! బొంబాయినుండి ఫ్లయిట్‌లో యిప్పుడే మా మేనేజింగ్ డైరక్టరు వచ్చేరు. అర్జంటు సమావేశం వుంది. అందుకని "

మరిక వినలేకపోయింది రాఘవమ్మ. విసురుగా ఫోన్ పెట్టేసింది.

వుసూరుమంటూ సోఫాలో కూల బడింది. నలగని పట్టుచీరను జాలిగా చూసుకుంది.

"పుట్టినరోజునాడైనా సరదాగా గడుపు దామంటే వీలయింది కాదు. ఎందుకొచ్చిన బతుకు? సంపాదన మీద అంత వ్యామోహం వున్న మనిషికి సంసారం ఎందుకో?" కసిగా భర్తను తిట్టుకుంది.

పుట్టినరోజని చెప్పినా అతనికి లక్ష్యం లేకపోయింది. వ్యాపారం గొడవలు ఎప్పుడూ వుండేవే. సంవత్సరానికి ఒక్క రోజైనా కట్టుకున్న ఇల్లాలి ముద్దుముచ్చట తీర్చలేని మొగుడు ఎందుకు? తనను అతను లక్ష్యం చెయ్యనప్పుడు తను మాత్రం ఆయన్నెందుకు లెక్కచెయ్యాలి" మనసులో అనుకుంది రాఘవమ్మ.


నిముషాలు భారంగా దొర్లిపోతు న్నాయి.

రాత్రి పది దాటింది.

ఏదో ఒక నిశ్చయానికి వచ్చిన దాని లాగా, లేచి నిల్చుంది. బద్ధకంగా వొళ్ళు విరుచుకుంది. అద్దం దగ్గరకుపోయి, నుదుటిమీద అక్కడక్కడా పడివున్న ముంగురుల్ని సవరించుకుంది

పోర్టికోలోని ఎడంవైపునున్న సిమ్మెంటు బెంచీ దగ్గరకు నడిచింది రాఘవమ్మ.

# మైల




బెంచీమీద కునికిపాట్లు పడుతున్నాడు డ్రయివరు మస్తాను.

వెన్నెల కాంతిలో డ్రయివర్ని నిముషంపాటు తదేకంగా చూసింది. కండలు తిరిగిన శరీరంతో, పులిమీసాలతో చిన్నసైజు వస్తాదులాగు వున్నాడు మస్తాన్.

అతని ఆకారాన్ని చూసి, చిన్నగా నవ్వుకుంది మస్తాన్ భుజంమీద తట్టింది. ఉలిక్కిపడుతూ లేచాడు మస్తాను. ఎదురుగా రాఘవమ్మ అపర రతీదేవిలా నిలబడివుంది

"మీ అయ్యగారు మీటింగ్‌కి వెళ్ళాలట. నా వొక్కదానికి యింట్లో పడుకోవడానికి భయంగావుంది. తోడుగా రారా" అని పిలిచింది.

సుపరిచితమైన ఆ పిలుపులో అంతర్యాన్ని తెలిసిన డ్రయివర్ మస్తాన్ హుషారుగా, రాఘవమ్మగారివెంట పడగ్గదిలోకి నడిచాడు.

మర్నాడుదయం—

"మా నాన్న వున్నాడండీ!" అంటూ వచ్చిన పదేళ్ళ కుర్రవాడ్ని చూసి ఆశ్చర్యపోయింది రాఘవమ్మ.

ఆ కుర్రవాడే క్రిందటిరోజు గుడిదగ్గర తన మడిని మంటగలిపాడు. మైల పడడంవలన తను గుడిలోకి వెళ్ళలేకపోయింది.

"మీ నాన్న ఎవడ్రా?" ప్రశ్నించింది.

"మస్తానండి" అన్నాడు, జారిపోతున్న నిక్కరును పైకి లాక్కుంటూ.

కుర్రవాడి మాటలకు అవాక్కయి నిలుచుండిపోయింది రాఘవమ్మ. □